# ఛిద్రం

**లో**పలికి వస్తూనే ఎయిర్‌బేగ్ పక్కకి విసిరేసి కళ్లతోనే కూతురు కోసం వెతుక్కున్నాడు శ్రీహరి.

సోఫాలో ఓమూల ఒదిగిపోయి అన్నం తినడానికి అమ్మను ఏడిపిస్తున్న సారస ఇటు తిరిగి చూసింది. శ్రీహరి మోకాళ్లమీద కూర్చుని చేతులు చాపాడు.

"నాన్నా... నాన్నా" సోఫాలోంచి ఒక్కదుముకు దుమికి చిట్టిచిట్టి అడుగుల్తో వచ్చి నాన్న మెడను వాటేసుకుంది సారస. రెండు చేతులూ మెడకి చుట్టేసి, భుజం మీద తలవాల్చేసి పువ్వులాంటి ముఖాన్ని నాన్న మెడ వంపులో దాచుకుంది.

ఆ చిన్నారి స్పర్శకి శ్రీహరి హృదయం అమృతంలో ముంచి తేల్చినట్లైంది. ఆ చిన్ని శరీరాన్ని అక్కున పొదువుకుని కొన్ని క్షణాలు అలాగే ఉండిపోయాడు. అతని కళ్లల్లో నీళ్లూరాయి.

"బావుంది తండ్రీ కూతుళ్ల వరస" సుధ నవ్వుతోంది. "దాని మూతికున్న పెరుగన్నమంతా మీ చొక్కాకి పులిమింది" నాన్న స్పర్శలోని తన్మయత్వం నుంచి ఇంకా కోలుకోని పాప తెల్లని బుగ్గలు మరింత తెల్లగా మెరుస్తున్నాయి. అన్నం పెట్టడానికి వాళ్లమ్మ పాపకి గౌను విప్పేసినట్టుంది. పాప చెడ్డీతోఉంది. లేగిన ఉంగరాల జుట్టు, ముంగురులు ముఖం మీదపడి గుండ్రని ఆ ముఖం పున్నమి చందమామలా అన్పించింది శ్రీహరికి. ఆ బుగ్గల మీద ముద్దుల వర్షం కురిపించాడు. కళ్లు తెరిచింది సారస. చక్రాల్లాంటి ఆ కళ్లు నీళ్లల్లో ఈదుతున్న రెండు చేపపిల్లల్లా మిలమిల లాడుతున్నై.

"నీకోసం ఏం తెచ్చానో చెప్పుకోనాన్నా" అన్నాడు శ్రీహరి.

"కేడ్‌బరీ మిలుకు చాక్లెత్తు".

"అరె, ఎలా చెప్పుకున్నావురా?" అన్నాడు కావాలని ముఖం నిండా ఆశ్చర్యాన్ని నింపుకొని.

"నాకు తెలుసు" అంది పాప గర్వంగా "నాన్నా, అమ్మకి చెప్పు చాక్లెత్తు తింతే పల్లు పాలైపోతాయని తిల్తుంది" చెవిలో చెప్పింది. "ఈ...." అంది పెదవులు తెరిచి. "నా పల్లు

బాగాలేవా?" లేత దానిమ్మగింజల్లాంటి పాప పళ్లను చూస్తూ - "చాలా బాగున్నయ్ నాన్నా, ముత్యాల్లా మెరుస్తున్నాయ్" అన్నాడు శ్రీహరి చాక్లెట్టు రేపరు విప్పుతూ.

"ముత్తాలంతే...?"

"ముత్యాలంటే.. ముత్యాలంటే.. నీపళ్లే".

కిలకిలా నవ్వి సారస తల్లివైపు గర్వంగా చూసింది.

"కూతురు తప్ప ఎవరూ కన్పించడం లేదు కాబోలు అయ్యగారికి" అంది సుధ మూతి ముడుచుకుంటూ.

శ్రీహరి నవ్వుతూ వెళ్ళి సుధ పక్కన సోఫాలో కూర్చున్నాడు.

"ఎలా ఉంది ఒంట్లో" అన్నాడు నిండారా చూస్తూ.

"బాగానే ఉంది. మరోపదిరోజుల్లో డెలివరీ కావచ్చంది డాక్టరు" సాధారణంగా నెలలు నిండాక వచ్చే ఒక విధమైన అలసట సుధ కళ్లల్లో కన్పిస్తోంది. కళ్లకింద లీలగా అర్ధ చంద్రాకారంలో నల్లగూడు కట్టింది.

"ఏమిటంత అలసటగా కన్పిస్తున్నావ్, సరిగ్గా తినడం లేదా?"

"అదేం కాదు, ఇదిగో ఈ మీ కూతురుతో రాత్రులు నిద్రసరిపోవడం లేదు. నాన్నా.. నాన్నా అని ఒకటే మారాం చేస్తోంది. అన్నం తినదు, పాలు సరిగా తాగదు, అన్నిటికీ ఒకటే పాట "నాన్న కావాలీ" అని, మా అమ్మ, నాన్న, చెల్లాయి అందరూ ప్రయత్నించినా ఈ నెల రోజులుగా దీన్ని మాలిమి చేసుకోలేకపోయారు. నామాట సరే, మీరేంటిలా సన్నబడిపోయేరు?

"నీ చేతి వంట తినక... సారీ సుధీ, మనకి ఒక పాప చాలు అనుకునీ వెంటనే జాగ్రత్త తీసుకోనందుకు నన్ను క్షమిస్తావా?"

సుధ సిగ్గుపడింది - "భలేవారే, అలా అయితే నేనూ మిమ్మల్ని క్షమాపణ అడగాలి".

"సరే, ఒకళ్లనొకళ్లు క్షమించేసుకుందాం, సరేనా" అన్నాడు శ్రీహరి నవ్వి.

"ఇక్కడ వీళ్లంత బాగా చూస్తున్నా మనింటికి ఎప్పుడెప్పుడు వచ్చేద్దామా అన్పిస్తోంది. అక్కడ ఒంటరిగా మీరేం పాట్లు పడుతున్నారో అని దిగులు. రెండు గదులదైనా అది మన ఇల్లు.

"అవును, వీళ్లంతా ఏరి?"

"గుడికెళ్లారు. ఫోనైనా చెయ్యకుండా వచ్చారేంటి? స్టేషనుకి మా నాన్నగారు వచ్చేవారుగా".

"పోనిద్దూ పాపం, పెద్దాయన్ని ఇబ్బంది పెట్టడం, ఇదిగో నా చిట్టి తల్లిని చూడాలన్పించింది, వచ్చేసేను". అన్నాడు ఒళ్లో ఉన్న కూతుర్ని మరింత హత్తుకుంటూ.

"ఆ..ఆ.. దాని చాక్లెట్టు పాకం అంతా మీ ఒంటికి పూసుకొంటున్నారు. నాకు భలే జెలసీ అన్పిస్తోందోయ్ మీ తండ్రీ కూతుళ్ల ఆప్యాయత చూస్తుంటే".

"ఏం మీ నాన్నగారు మాత్రం మిమ్మల్ని ఇంత ఆప్యాయంగా చూడలేదా?".

"నాకు గుర్తున్నంతవరకూ చూడలేదు. అయినా, ఆయన మీలాగా భావుకుడు కాదు కదా!".

"బావుంది, భావుకులకేనా ప్రేమ ఉండేది".

"భావుకులే ప్రేమను వ్యక్తం చెయ్యగలిగేది" సుధ భుజం చుట్టూ చెయ్యి వేసి ఆమె తలని తన గుండెకి హత్తుకున్నాడు శ్రీహరి.

నిజంగా చాలా చిత్రంగా ఉంటుందతనికి. రెండేళ్ల క్రితం సారస పుట్టక ముందు తనకి నిజమైన ప్రేమంటే తెలీదన్పిస్తుంది. తన బాల్యం ఏమంత చెప్పుకోదగింది కాదు. అయిదుగురు పిల్లలున్న, ఆర్థికంగా అట్టడుగు కుటుంబంలో మధ్యవాడిగా పుట్టిన తను కావాలనుకోలేదో, ఆమె చేరదియ్యలేదో కాని తల్లిప్రేమ తనని ప్రభావితం చేసేంతగా లభించలేదు. తనకే కాదు, తన ఇంట్లో ఎవరికీ లభించలేదు. రోజంతా రెక్కలు ముక్కలయ్యేలా ఇంటి చాకిరీ చేసి అలిసిపోయే తల్లికి పిల్లల్ని ప్రేమిస్తూ కూచోడానికి టైమెక్కడుంటుంది?

పెళ్లయ్యాక సుధీ తనకెంత చేరువైనా తను మాత్రం ఏదో అసంతృప్తి ఫీలవుతూ ఉండేవాడు. పురుషుడి మనుగడ వెనక తల్లిగా, చెల్లిగా, ప్రేయసిగా స్త్రీ ఉండాలనే మాట ఉత్త అబద్ధమన్పించేది. ఎవర్ని ఎవరూ ప్రభావితం చెయ్యరు, అంతా ఉత్త ట్రాష్ అనుకునేవాడు. కాని, సారస పుట్టి తన ఆలోచన్ల తీరునే మార్చేసింది. బంగారు తల్లి, బాచాలకొండ సారస, కళ్లు తిప్పి చూపుల్తో మనుషుల్ని గుర్తించడం వచ్చిన నెలల ప్రాయంలోనే సారస నాన్నని బాగా గుర్తుపెట్టుకుంది. నాన్న కన్పించగానే కాళ్లూ చేతులూ కదిపి కేరింతలు కొట్టేది. సారస మొదట నేర్చుకున్న మాట 'నాన్న' అనే. కూతురు తన పట్ల చూపించే అమితమైన ప్రేమ శ్రీహరిలో నిర్లిప్తతని పారదోలింది.

"అమ్మా, నాన్నకి అన్నం పెత్తు, నేన్తినిపిత్తా" అంటోంది సారస.

"మీ నాన్నకి అన్నం నేనెందుకు పెట్టాలే, నేను పెట్టనుపో".

"చూలు నాన్నా అన్నం పెత్తనంతంది అమ్మ, పోన్లే నేపెత్తానే"

"చూసేవా నాకూతురికెంత శ్రద్ధో నామీద! అలాగే తింటాలే తల్లీ. ముందు లాలపోసుకుని వస్తాను. అప్పుడు నువ్వు నాకు బువ్వపెడుదువుగాని.

"అవునూ... మన వాకిట్లో బంతిమొక్కలు పూతకొచ్చేయా?" వంటింట్లోంచి కేకపెట్టింది సుధ."ఆ... రంగురంగుల బంతిపూలు విరిసి చూడ్డానికి రెండు కళ్లూ చాలడం లేదనుకో".

"ఎవర్నీ కొయ్యనివ్వకండి. ఆఫీసుకెళ్లేటప్పుడు పక్కింటివాళ్లని చూస్తూండమని చెప్పి జాగ్రత్తగా గేటు తాళం వేసుకుని వెళ్లండి".

"ఇప్పుడెళ్లనా..."

తన వెనకే విన్పించిన శ్రీహరి గొంతువిని ఆనందంగా నవ్వింది సుధ.

❀ ❀ ❀

వేళ్లమధ్య చురుక్కుమన్న సిగరెట్టుని జాగ్రత్తగా పిట్టగోడ మీద ఉంచి జేబులో మిగిలున్న ఆఖరి సిగరెట్టుని తీసి దాన్తోదీన్ని అంటించేడు శ్రీహరి. ముందు సిగరెట్టు వెలిగించడానికే ఆఖరి అగ్గిపుల్ల ఖర్చైపోయింది మరి. ఇప్పుడీ బ్రిడ్జి టెర్రస్ మీది నుంచి కిందికి దిగే ఓపికా, ఆసక్తీ లేవు.కొత్తగా వెలిగించిన సిగరెట్టుని పెదవుల మధ్య ఇరికించుకొని, మొదటిదాన్ని బొటనవేలుకి చూపుడువేలుని ఆనించి కేరమ్స్ కాయిన్ని స్ట్రైకర్‌తో కొట్టినట్టు బలంగా కొట్టాడు. ఆ కాల్తున్న సిగరెట్టు ముక్క ఎగిరెళ్లి కింద రాళ్ల గుట్టల మీద పడింది.

ప్రవహిస్తున్న గోదావరి కవతల సూర్యుడు పడమటి కొండల్లోకి ప్రయాణం కట్టాడు. నల్లని మేఘం ఒకటి ఎప్పుడొచ్చిందో ఆకాశాన్ని ఈ చివరి నుంచి ఆ చివరి వరకూ తిరుమల కొండల ఆకారంలో ఆక్రమించుకుంది. ఆ కొండల అంచుల్ని దీపతోరణాల్తో అలంకరించినట్టు మేఘం వెనక నుంచి కిరణాలు ఎరుపురంగుని చిలకరిస్తున్నాయి. అద్భుతంగా ఉన్న ఆదృశ్యం శ్రీహరిని ఆకర్షించడం లేదు. ఎర్రబడ్డ కళ్లలోంచి కన్నీరు బైటికి ఉబికి రాకుండా తనని తను చిక్కబట్టుకోడానికి ప్రయత్నం చేస్తున్నాడు.

నిన్నటికీ ఇవాల్టికీ ఎంత తేడా!

నిన్న ఆనందహేలలా అన్పించిన జీవితం ఇవాళ విషాద లీలలా తోస్తోంది.

ఉదయం నుంచి నచ్చచెప్పుకొని జయించేననుకున్న ప్రాణభయం తిరిగి తనని కాలమేఘంలా కమ్ముకుంటోంది. అంతకన్నా ముఖ్యంగా తన చిన్నారి సారస, మరో బిడ్డకు జన్మనివ్వబోతున్న సుధ ఏంకానున్నారు? తను చేసిన పొరపాటు వాళ్ల జీవితాల్ని బలి తీసుకోనుందా? కాంక్షని అదుపులో పెట్టుకోలేక పెళ్లికి ముందు తను చేసిన చీకటితప్పులు ఇలా ఇందరి జీవితాల్ని కబళిస్తాయని తను కొంచెమైనా ఊహించాడా?

శ్రీహరికి తెలీకుండానే అతని కళ్లు జలధారలయ్యాయి. అతని చదువు, ఉద్యోగం, సౌందర్య పిపాస, ప్రకృతిని ప్రేమించేతత్వం, అతను స్పందించి రాసుకునే కవిత్వం,

పురుషుడిననే గర్వం అన్నీ నీటిబుడగల్లా పేలిపోయి మస్తిష్కంలో శూన్యాన్ని నింపేసాయి. మరణం అనే పదం ఒక్కటీ అతని వెన్ను నిమురుతోంది. ముసురుకోబోతున్న చీకటి అతని చెవిలో మరణమృదంగ ఘోషని నింపేస్తోంది.

రెయిలింగుకి ఆనుకుని జేబులోని మెడికల్ రిపోర్ట్సని చేతిలోకి తీసుకున్నాడు.

హెచ్.ఐ.వి. పాజిటివ్; క్రిటికల్....

టక్కున కవర్లో పెట్టేసాడు.

నిస్తేజంగా మెట్లుదిగడానికి ఉపక్రమించాడు. కాళ్లల్లో సత్తువలేనట్టు, ఆయాసం కమ్ముకొస్తున్నట్టు రకరకాల భావనలు... ఈ మధ్య త్వరత్వరగా బరువు తగ్గుతూంటే 'ఏమో' అనుకున్నాడు. అప్పుడప్పుడు హైఫీవరు వచ్చి మందులు వాడుతున్నా తగ్గడానికి టైం తీసుకుంటూంటే పెద్దగా పట్టించుకోలేదు. త్వరగా అలిసిపోవడం పని ఒత్తిడి కారణం అనుకున్నాడు.

తను పని చేస్తున్నది ఒక ప్రైవేటు ఫుడ్ ప్రొడక్ట్ ఆఫీసులో. ఏడాదికోసారి ప్రొడక్షన్ సైడు వర్కర్స్ అందరికీ కంపెనీయే టెస్టులన్నీ చేయిస్తుంది.

ఇదివరకు ఒకరో ఇద్దరో హెచ్.ఐ.వి. పాజిటివ్స్ గుర్తింపబడేవారు. ఇప్పుడు ఏడాదికోసారి పాతికమందైనా ఉద్యోగం నుంచి తొలగించబడుతున్నారు.

ఆ మధ్య ఒక వర్కరు ఈ కబురు తెలిసిన డిప్రెషన్లో ఇంట్లో అందర్నీ చంపేసి, తను ఆత్మహత్య చేసుకున్నాడు.

శ్రీహరి ఖర్చులు కలిసొస్తాయని కంపెనీ తరపున టెస్ట్ చేయించుకున్నాడు. రిపోర్ట్స్ చేతికొచ్చేవరకూ అతని ఊహలోకి కూడా రాలేదు. తన శరీరం ఇలా నివారణ కనుక్కోబడని రోగం బారిన పడుతుందని.

ఇప్పుడిక ఉద్యోగం నుంచి తొలగింపబడినట్టే. శ్రీహరికి చిన్నపిల్లాడిలా భోరుమని ఏడవాలన్పిస్తోంది. తన సారస... ఎప్పటిలా నాన్నా... నాన్నా అని తనని హత్తుకునే సారసని ఎలా దూరంగా ఉంచగలడు? తను క్రమంగా శిథిలమౌతూ వాళ్లనెలా శిథిలం చెయ్యగలడు! అలాగని వాళ్లని వదిలి ఎక్కడికి పోగలడు!

హఠాత్తుగా అతనికో కర్తవ్యం గుర్తుకొచ్చింది. ముందుగా సుధకీ, సారసకీ మెడికల్ చెకప్స్ చేయించాలి. ఎలా? అలాగని నిర్దయగా వాళ్లనెలా బలిచెయ్యగలడు! హు.. ఎంత వెర్రిగా ఆలోచిస్తున్నాడు, ఇప్పుడు కొత్తగా బలిచేసేదేముంది, తనతో కలిసి కాపురం చేసిన సుధనీ, తన రక్తాన్ని పంచుకుని పుట్టిన సారసనీ ఎప్పుడో బలి తీసుకున్నాడు తను.

తన ఆలోచనలు అస్తవ్యస్తంగా ఉన్నాయని అర్థమౌతోంది. సుధకీ, పిల్లలకి ఏం కాకూడదని మనసులో మరీమరీ కోరుకున్నాడు.

తన ఈ అనారోగ్యం ఎవరితోనైనాఎలా చెప్పుకోగలడు? ఏ రోగానికైనా సానుభూతి లభించొచ్చుకానీ, దీనికి లభిస్తుందా? ప్రభుత్వం ఎంత ప్రచారం చేసినా ఈ రోగుల్ని డాక్టర్లు నర్సులు సైతం దూరంగా ఉంచుతారని విన్నాడు తను.

ప్రాణభయంతో ఒళ్లంతా చెమటలు పోసాయి. వెనక బ్రిడ్జి మీద పరుగెడుతున్న రైలు తన గుండెలో పరుగెడుతున్నట్టుంది.

కింద చల్లగా ప్రవహిస్తున్న గోదారి తనని నిశ్శబ్దంగా తనలో కలిపేసుకుంటే బావుండును.

చీకట్లు ముసురుకున్నాయి.

అలవాటు ప్రకారం కాళ్లు కాయాన్ని ఇంటికి లాక్కొచ్చాయి. ఇంటి ముందు కంచె గేటు బార్లగా తెరిచి ఉంది. వీధిలైట్ల వెలుగులో బంతిపూల తోటంతా బోసిపోయి కన్పించింది.

తలుపు తాళం తీసి వాకిట్లోలైటు వేసాడు.

ఏ జంతువు లోపలికి ప్రవేశించిందో, బంతిపూల చెట్లన్నీ తినేసి, తినగా మిగిలిన మొళ్లని కాళ్లతో తొక్కిపడేసింది.

సుధ అపురూపంగా పెంచుకున్న చిన్ని పూలతోట ఛిద్రమైపోయింది.

*నడుస్తున్న చరిత్ర, సెప్టెంబరు 2004*